# గాలిసు



## రవి కొలికపూడి

విష్ణుమూర్తి మరోసారి భార్య ముఖంలోకి చూశాడు. ఆమె మొఖంలో ఏ భావం లేదు— ఇందాకటికన్నా మరికాస్త అసహ్యంగా చూసింది భర్తవేపు.

'సారీ—సరోజా—అర్థంచేసుకో' ప్రబతిమాలాడు విష్ణుమూర్తి.

ఆమె నెమ్మదిగా లేచి కిచెన్‌లోకి వెళ్ళిపోయింది.

విష్ణుమూర్తి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

తనెందుకిలా ప్రవర్తించాడు?

తనకు పెళ్ళయ్యి ఐదేళ్ళవుతోంది— ఇప్పటివరకు ఒక్కరిచేత మాటనిపించుకోని ఎరుగడు.

చివరకు తన బాస్‌కూడా ఇంతవరకూ తనపై ఇరిటేట్ కాలేదు.

'కానీ— ఈరోజు... షిట్...'అనుకుంటూ జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించాడు.

ఇంతకాలం కాపురంచేసిన పెళ్ళామే నమ్మకపోతే పొరుగువాళ్ళు ఎలా నమ్ముతారు—

'నమ్మకం— ఈ నమ్మకం లేకపోతే వేస్ట్' తనలోనే గొణుక్కుంటున్న భర్తని కిచెన్ గుమ్మంలో నిలబడి గమనిస్తోంది సరోజ.

విష్ణుమూర్తి భార్యవేపు చూడగానే— చివాల్న తల తిప్పేసుకుంది.

అతను విసురుగా లేచి బయటకెళ్ళిపోయాడు.

అతని మనసంతా ఖాళీగా ఉంది— గుబులుగా ఉంది— భూమ్మీద సర్వసృష్టీ నాశనమైపోయా తానొక్కడే మిగిలిపోయాడన్నంత దిగులుగా ఉందతనికి.

అపును మరి—

(తనకు మాత్రమే!) రంభలాంటి సరోజ— తనని అసహ్యించుకుందంటే సామాన్యమైన విషయం కాదాయే మరి— పైగా ఆమె తనవాళ్ళందర్నీ వదిలి కోరి తనని పెళ్ళాడింది.

విష్ణుమూర్తి రోడ్డుమీద నడుస్తున్నాడు.

'బాబూ— రెండ్రోజుల్నించి కడుపులో ఏమీ పడలేదు— ఒక్క రూపాయుంటే సాయుంచేయి' అరవై ఏళ్ల వృద్ధురాలు 'దీనంగా అడుగుతుంటే—

చిరాగ్గా చూశాడతను ఆమెవేపు—

రెండడుగులు ఆమెని దాటి ముందుకేశాడతను.

మళ్ళీ వెనక్కొచ్చి ఆమెకు రూపాయిచ్చి వెళ్తుంటే— ఆమె ఓ మాదిరిగా నవ్వింది రూపాయి తీసుకుంటూ— తనూ నవ్వాడు—

నవ్వుతూనే నడుస్తున్నాడు విష్ణుమూర్తి—

విష్ణుమూర్తి రెండురోజుల నుంచీ తిండిలేదన్న ఆమె మాటకు జాలిపడి రూపాయిస్తే— ఆమె నవ్వింది సంతృప్తిగా—

తన జీవితంలో ఓ రెండొందలు 'కట్'చేసిభార్యకిస్తే రెండొందలు ఏమైనట్లని రెండురోజుల నుంచీ తనని వేధిస్తోంది తన భార్య—

ఆ రెండొందలు కూడా ఇచ్చినట్లయితే—

సరోజకూడా నవ్వేదే—

అచ్చు ఈ ముసల్ది లాగానే—

సరోజ ... ముసల్ది— ముసల్ది... సరోజ ...

విష్ణుమూర్తి నడుస్తున్నాడు—

ఎదురుగా నవ్వుతూ నిలబడ్డ తన తమ్ముడు చలపతిని చూసి విష్ణుమూర్తి నవ్వలేదు—

ఈ చికాకు అంతటికీ కారణం వాడే కనుక.

పలకరింపుగా కళ్లెగరేశాడు.

'ఎక్కడిదాకా అన్నయ్యా...' చలపతి అన్నతో నడుస్తూ అన్నాడు.

'ఇక్కడికే...' ముక్తసరిగా చెప్పాడు విష్ణుమూర్తి.

'మొన్న నువ్విచ్చిన రెండొందలతో నా రూం రెంట్ వంద ఇచ్చి, మిగిలినది తర్వాత ఇస్తానన్నాను. అమ్మ ఆరోగ్యం బాగోలేదని కాలేజీకి ఉత్తరం వచ్చింది. అందుకని ఓ యాభై మధ్యాహ్నం ఎం.ఓ చేశాను' చెప్పాడు చలపతి.

'మళ్ళీ రూం రెంట్ ఎక్కడనుండి కడతావ్?'

సిగరెట్ విసిరేస్తూ అడిగాడు విష్ణుమూర్తి.

'మా ఫ్రెండొకడు ఇస్తానన్నాడు ఓ రెండు మూడు రోజుల్లో— ఫస్ట్‌నుంచీ నేనూ జాబ్ చేద్దామనుకుంటున్నాను' చలపతి కొంచెం రోషంగా అన్నాడు.

విష్ణుమూర్తి మాట్లాడలేదు. రోడ్డుపక్కనున్న ఇరానీ కేఫ్‌లోకి దారితీశాడు. అతన్ని అనుసరించాడు చలపతి.

ఇద్దరూ మౌనంగా టీ తాగారు.

చలపతి ఆలోచిస్తున్నాడు— అమ్మకు బాగోలేదని చెప్తే కనీసం— ఏమైంది? అనికూడా అడగని తన అన్నపై ఓ మాదిరి కసి— తన పైనే తనకే అసహ్యం—

ఏదో ఒక ఉద్యోగం చేస్తే— ఇలా దేబిరించడం ఉండదుకదా—

'మీ వదినకి చెప్పొద్దు ఇలా ఇచ్చానని—'

ఇవ్వక ఇవ్వక మొన్న తనకిచ్చిన రెండు వందలు ఇచ్చేప్పుడు విష్ణుమూర్తి అన్న మాటలు ఓసారి గుర్తొచ్చాయి చలపతికి.

'ఎక్కడా ఉద్యోగం?' మరో సిగరెట్ వెలిగిస్తూ అడిగాడు విష్ణుమూర్తి.

'చైనీస్ రెస్టారెంట్‌లో అకౌంటెంట్— సాయంత్రం ఐదునుంచీ పదివరకూ— ఐదు వందల యాభై ఇస్తామన్నారు' చలపతి టీ కప్ చూస్తూ చెప్పాడు.

'ఇప్పుడు నీకు జీతమెంతొస్తుంది— హౌస్ లోన్ వగైరాలు పోనూ' చలపతి అడిగాడు.

'ఎంతరా— మూడు చిల్లరొస్తుంది' విష్ణుమూర్తి మూడొందలొస్తున్నట్లుగా ముఖంపెట్టి చెప్పాడు.

'మరి పెళ్ళికి సంబంధాలొస్తున్నాయటూ... కట్నం ఎంతో ఒకంత ఇవ్వాలికదా..' తన అన్న మాట్లాడడం చిరాగ్గా ఉన్నా తప్పలేదు చలపతికి.

మళ్ళీ ఆదివారం కనిపిస్తాడు— అదీ తను వెళ్తేనే. లేకపోతే— ఎన్ని నెలలయినా ఇద్దరూ కలవడం అసాధ్యం.

'ఇస్తే బాగుంటుంది మరి— మనదగ్గర ఉండాలిగా. చూస్తూనే ఉన్నావుగా— ఇల్లు కంప్లీట్ కాలేదు— అప్పుడే మూడున్నర లక్షలైంది ఎక్కడ్రా... నా నుండి పెళ్ళికి ఏ ఐదారువేలో ఇవ్వగలను అంతే' బాధపడుతూ చెప్తున్న విష్ణుమూర్తి వైపు జాలిగా చూశాడు చలపతి.

'నమస్తే సాబ్' పక్కనే సిగరెట్ తాగుతూ నిలబడ్డ కంట్రాక్టర్ బాలకిషన్ చూసి— ఆనందంగా నవ్వాడు విష్ణుమూర్తి.

'ఏం కిషన్ భాయ్.. ఆరోజు వస్తానని రాలేదు— పారాపుట్ వాల్‌కి ఏ డిజైన్ బాగుంటుందో ఆలోచించావా?' మరో టీకి ఆర్డరిస్తూ అడిగాడు విష్ణుమూర్తి.

'ఆలోచించాను సాబ్.. కానీ కొంచెం ఖర్చెక్కువవుతుంది— అయినా వెరయిటీగా ఉంటుందని' ఎక్స్‌ప్లెయిన్ చేశాడతను.

'మాబోటివాళ్ళు జీవితంలో ఓసారేకదా ఇల్లు కట్టించేదీ— ఫర్లేదు నువ్వన్నట్లే చేసేద్దాం ఎప్పుడు-రేపట్నుంచీ వస్తారా?' అడిగాడు విష్ణుమూర్తి.

'లే.. సాబ్.. వారం రోజుల తర్వాత వస్తం ఈ లోపుగా డబ్బు రెడీ చేసుకోండి' బాలకిషన్ తన స్కూటర్ స్టాండ్‌తీస్తూ చెప్పాడు.

'నువ్వు రేపొచ్చినా మేము రెడీయే'— నవ్వా





డు ధీమాగా విష్ణుమూర్తి.

నవ్వి స్కూటర్‌పై వెళ్ళిపోయాడు బాలకిషన్.

చలపతికి సిగరెట్ తాగాలని ఉంది.

ఎదురుగా తన అన్న విలాసంగా తాగుతుంటే — మరీ మనసు పీకుతుంది.

'పదరా—ఇంటికెళ్ళి భోంచేద్దాం' అని హోటల్ బయటికొచ్చి నిలబడ్డాడు.

వచ్చిన సప్లయిర్‌కి టీకి డబ్బులు ఇస్తూ ఓసారి అన్నవేపు చూశాడు.

విష్ణుమూర్తి ముఖంలో ఏ భావంలేదూ—

చాలా సహజంగా చూస్తున్నాడతను—

మిగిలిన చిల్లరని జేబులో వేసుకొని— విష్ణుమూర్తిని అనుసరించాడు—

చలపతికి తన రూంకి వెళ్లిపోవాలనుంది.

ఇక ఛస్తే రాకూడదు— వరసన పదిరోజులు సెలవలొచ్చినా సరే—

ఏదో ఈనెల తనరూంమేట్ రెంట్ కట్టలేక షేర్ అడిగాడుకానీ— మెస్‌బిల్లు, రెంటూ వాడే భరిస్తున్నాడు— 'వీడి'కన్నా వాడే నయం — కసిగా అనుకున్నాడు చలపతి.

ఇంటి దగ్గరకు రాగానే—

మళ్ళీ ఓసారి గుర్తుచేశాడు విష్ణుమూర్తి—

'రెండు వందలిచ్చినట్లు వదినకు చెప్పవద్దని'

చలపతికి చిరాకేసింది—

ఇద్దరూ లోపలికి వెళ్లగానే - సరోజ మరిదివేపు చూసి— లోనికెళ్ళిపోయింది—

ఓ పాత కుర్చీనో, మంచాన్నో చూసినంత నిర్లిప్తంగా చూసింది—

చలపతినవ్వాడు పలకరింపుగా

ఆమె నవ్వలేదు—

అయినా చలపతి పట్టించుకోలేదు—

ఇద్దరికీ భోజనాలు వడ్డించింది— టేబుల్‌కి ఎదురెదురుగా కూర్చున్నారు అన్నదమ్ములిద్దరూ—

సరజ మధ్యలో కూర్చుని వడ్డిస్తోంది.

ముగ్గురూ మాట్లాడుకోవడంలేదు—

చికెన్ నములుతున్న శబ్దం మాత్రమే వినిపిస్తోంది.

చలపతి ఇబ్బందిగా ఫీలై—

'మీ ఇల్లు చాలా బావుంది వదినా' అన్నాడు—

'డబ్బులు బాగోలేవూ... ఎంత కష్టపడితే వచ్చిందీ.. ఈ మహానుభావుడికి తెలీటంలేదు — జీతం రావడమే గొర్రెతోకంతా— దానికి తోడు— మరే ముదనష్టపోడికిచ్చాడో ఈనెల— అదికూడా పూర్తిగా ఇవ్వలేదు...'

తలవంచుకు తింటున్న చలపతికి తెలుసు— తన అన్న తనవేపే చూస్తుంటాడని—

తన అన్న మనస్తత్వం బాగా తెలుసు—

మంచివాడే— తనన్నా, చెల్లెలన్నా ప్రాణం—

అయినా— తన భార్యంటే వల్లమాలిన ప్రేమ... కాదు భయం...

ఇక్కడే చలపతికి అర్థంకాని విషయం— ఒకటుంది—

పెళ్ళాల్ని చావచితగ్గొట్టి— మరీ పనులు చేయిస్తారు. సదరువాళ్లుకూడా రాత్రి కొడితే— మళ్లీ తెల్లవారి మామూలయిపోతారు.

మరి— వీళ్ళుకూడా భర్తలే కదా— ఎందుకు తిరగబడరు—

రేపు తనకు కూడా పెళ్లయితే...

ఇలానే— తన తల్లినీ— చెల్లినీ ఓవర్‌లుక్ చేస్తాడా? అగ్గిపుల్లలా ప్రారంభమై దావానంలా వ్యాపించిన ఊహకి ఒక్కసారే ఉలిక్కిపడ్డాడు.

'ఏమైందిరా?' ఆతృతగా అడిగాడు విష్ణుమూర్తి.

నవ్వుతూ— 'ఏం లేదు' అని తన అన్న ముఖంలోకి చూశాడు—

విష్ణుమూర్తి కళ్లలో సన్నని నీటి తెర—

చలపతి చలించిపోయాడు—

'నటన— ఆప్యాయత— ప్రేమ—'

ఈ మూడింటినీ ఒక్కసారే చదవగలిగాడు విష్ణుమూర్తి ముఖంలో—

జీవితాంతం తోడుగా ఉండే తన భార్యదగ్గర నటిస్తున్నాడు—

ఎందుకీ నటన— ఆమెను వదిలేసి మరొకర్ని పెళ్ళాడొచ్చుగా— ఒక్క ఆడదాని కోసం— ఎందుకీ తాపత్రయం—

అసలెందుకీ బంధాలూ— వగైరా ట్రాష్‌లూ — పెళ్ళిళ్లుకూడా కాంట్రాక్ట్ బేసిస్‌పై చేసుకుంటే సరి— అప్పుడీ 'నటన' కనిపించదు— వెధవ జీవితం—

చలపతికి ఇప్పుడు విష్ణుమూర్తిపై కోపం పోయింది— అది కాస్తా— వైవాహిక జీవితంపైకి మళ్ళింది—

ముఖ్యంగా స్త్రీపై—

'ప్రపంచమే నాటకరంగమని సెలవిచ్చిన మహానుభావుడెవరో తెలీదుకానీ—

ఆడది మాత్రం పుట్టుకతోనే నటి—

'ఆడదో విష కీటకం' కసిగా అనుకున్నాడు.

'ఈ రాత్రి ఉండరా—రేపు ఇక్కడనుంచే కాలేజీకి వెళ్దువుగానీ— వి.సి.పి ఉంది గదా— ఏమైనా కేసెట్స్ తెచ్చుకో' అన్నాడు విష్ణుమూర్తి.

చలపతి ఉలిక్కిపడ్డాడు—

'వద్దన్నయ్యా— అర్జెంట్‌గా పని ఉంది వెళ్తాను' అన్నాడు.

విష్ణుమూర్తి ఏం మాట్లాడలేదు. సరోజ నిశ్శబ్దంగా కూర్చుంది.

అమ్మో— ఈ రాత్రి ఇక్కడే వుంటే తన ఆరాధ్యదేవత 'ప్రీతి'కి ఎంత కోపమొస్తుందీ— ఈ సాయంత్రం కలుస్తానన్నాడు పైగా తను—

చలపతికి తెలీయకుండానే నవ్వుతున్నాడు తన 'ప్రీతి' గుర్తుకురాగానే—

అచ్చు ఐదేళ్లక్రితం కూడా విష్ణుమూర్తి ఇలానే నవ్వుకునేవాడు తన సరోజ గూర్చి ఆలోచిస్తూ.